

హైదరాబాద్ వార్త


# మెట్రో రైళ్లలో ఛార్జీలు పెంపు

**-రేపటి నుంచే అమలు**

**-కనీస ఛార్జీ రూ.10 నుంచి రూ.12కు పెంపు**

**-గరిష్ఠ ఛార్జి రూ.60 నుంచి రూ.75కు పెంపు**



**హైదరాబాద్, మే 15 ప్రభాతవార్త**

నగరవాసులకు మెట్రో షాకిచ్చింది. మెట్రో రైళ్ల టికెట్ల ధరలను పెంచుతూ ఎల్అండ్‌టీ నిర్ణయం తీసుకుంది. ఛార్జీల పెంపుపై కొంతకాలంగా ఊగిసలాడుతున్న ఎల్ అండ్ టీ అధికారులు నష్టాలను నివారించుకునేందుకు ఛార్జీలు పెంచి ప్రయాణికులకు భారం మోపారు. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం నియమించిన చార్జీల నిర్ణయ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) ఇచ్చిన నివేదిక ఆధారంగా టికెట్ రేట్లు పెంచారు. హైదరాబాద్ మెట్రో రైళ్లలో పెరిగిన ఛార్జీలు ఈనెల 17వ తేదీ నుంచి అమలులోకి రానున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. మెట్రో రైలు కనీస ఛార్జి రూ.10 నుంచి రూ.12 కు పెంచారు. అంటే రూ.2 పెరిగింది. గరిష్ఠ ఛార్జి విషయానికి వస్తే రూ.60 నుంచి రూ.75కు పెరిగింది. అంటే రూ.15 పెంచినట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రకటించింది. హైదరాబాద్‌లో మొదటి దశ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంలో 2012లో రూ.14,132 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించి 2017 నవంబరులో పూర్తి చేశారు. మియాపూర్-ఎల్బీనగర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోలు-రాయదుర్గం మధ్య 63.2 కిలోమీటర్ల పరిధిలో పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం రోజుకు 1,200సర్వీసులు నడుస్తుండగా 4.80 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో 5.10 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. కరోనాకు ముందు రోజుకు రూ.80 లక్షలకు పైగా ఆదాయం సమకూర్చుకున్న సంస్థ.. తర్వాత నుంచి కుదేలైంది. 2020 నుంచి 2022 వరకు ప్రయాణికుల రాకపోకలు తగ్గడంతో పాటు మాల్స్, ప్రకటనల నుంచి ఆశించిన ఆదాయం రావడం లేదని సంస్థ పలు సందర్భాల్లో పేర్కొంది. ఇదే సమయంలో రవాణా ఆధారిత అభివృద్ధి (టీవోడీ) కింద ప్రభుత్వం ఇచ్చిన 267 ఎకరాల భూమిలో కేవలం నాలుగైదు ప్రాంతాల్లోనే కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మించింది. చాలావరకు భూములు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం పేరిట మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తుండంతో ఆ భారం కూడా మెట్రోపై పడిందని ఎల్ అండ్ టీ అధికారులు చెబుతూ వస్తున్నారు. అయితే టికెట్ రేట్ల సవరణపై హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ (హెచ్ఎంఆర్), అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విజ్ఞప్తితో కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరులో ఎఫ్ఎఫ్‌సీని నియమించింది. ఆ కమిటీ నగరంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి కేంద్రానికి నివేదిక సమర్పించింది. 2023 జనవరి నుంచి రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం రావడంతో ఆ విషయం మరుగునపడింది. అయితే చార్జీల పెంపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ఎట్టకేలకు ఛార్జీలు పెంచారు. దీంతో ఏటా రూ.150-170 కోట్ల వరకు వార్షిక ఆదాయం రాబట్టుకోవాలని ఆలోచిస్తున్నామని, తద్వారా నష్టాలను కొంతైనా తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**పెరిగిన టికెట్ల చార్జీలు ఇలా ..**

| దూరం (కి.మీ.లో) | ప్రస్తుత ఛార్జీ | పెరిగిన ఛార్జీ (రూపాయల్లో) |
|---|---|---|
| 0-2 | 10 | 12 |
| 2-4 | 15 | 18 |
| 4-6 | 25 | 30 |
| 6-9 | 30 | 40 |
| 9-12 | 35 | 50 |
| 12-15 | 40 | 55 |
| 15-18 | 45 | 60 |
| 18-21 | 50 | 66 |
| 21-24 | 55 | 70 |
| 26 కి.మీ నుంచి ఆపై | 60 | 75 |

# ముక్తార్‌గంజ్ వద్ద భారీ అగ్నిప్రమాదం

**-చిన్నారితోపాటు ఏడుమందిని కాపాడిన అగ్నిమాపక దళం**



అగ్నిప్రమాదం నుంచి పసికందను కాపాడిన అగ్నిమాపకం దళం



అగ్నిప్రమాదం సంభవించిన భవనం

**అఫ్జల్‌గంజ్,మే 15ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ సంభవించిన సంఘటనలో ఆస్థినష్టం తప్ప,ఎలాంటి ప్రాణం నష్టం సంభవించలేదు.గురువారం ఉదయం సిద్దింబర్ బజార్ సమీపవంలోని ముక్తార్‌గంజ్‌వద్ద ఉన్న మూడు అంతస్తుల,కమర్షియల్, రెసిడెన్సియల్ భవనంలో ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిప్రమాదం జరిగిన భవనంలో నివసిస్తున్న రెండు కుటుంబాలలో ఆరు మంది వ్యక్తులతో పాటు నెలలు నిండిన ఓ చిన్నారిని అగ్నిమాపక దళం సిబ్బంది రక్షించారు.ఆ కుటుంబం ఊపిరి పీల్చుకున్నారు.ఈ అగ్నిప్రమాదం అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముక్తార్‌గంజ్‌లో జరిగింది.ఇన్‌స్పెక్టర్ రవినాయక్ కథనం ప్రకారం... సిద్దింబర్‌బజార్ చౌరస్తా సమీపంలోని ముక్తార్‌గంజ్ ప్రాంతానికి చెందిన కిషోర్‌లాల్ వాని భవనంలో రెండు కుటుంబాలు నివాసాం ఉంటున్నారు. గురువారం ఉదయం 9గంటల ప్రాంతంలో ఆ భవనం నుంచి పోగలు రావడం కనిపించాయి. మంటలను అంటుకుని పోగలు వస్తున్న విషయాన్ని స్థానిక ప్రజలు గమనించి ముందుగా పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే పోలీసులు అగ్నిమాపక దళానికి సమాచారం అందించడంతో హుటా హుటినా అగ్నిప్రమాదం సంభవించిన బిల్డింగ్ వద్దకు చేరుకున్నారు.అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దీంతో విపరీతంగా పోగలు వ్యాపించడంతో అగ్నిమాపక దళం భారీ ల్యాడర్‌ను రప్పించి మంటలను ఆర్పివేస్తు భవనంలో చిక్కుకున్న వృద్దురాలు, నెలల రోజులు నిండిన చిన్నారితోపాటు మరో ఐదు మందిని సురక్షితంగా బయటకు తీసుకు వచ్చి రక్షించారు.దీంతో ఊపిరి పీల్చుకున్నారు. మొదటి అంతస్తు నుంచి రెండు మూడు అంతస్థులకు భారీగా మంటలు వ్యాపించడంతో నాలుగు ఫైరింజన్ల ద్వారా మంటలను పూర్తి అదుపులోకి తీసుకు వచ్చేందుకుగాను అగ్నిమాపక దళం సిబ్బంది శ్రమించారు.మంటలను అదుపులోకి తీసుకు వచ్చేందుకుగాను దాదాపు మూడు నుంచి ఐదుగంటలపాటు శ్రమించారు.ఈ భవనంలో ప్లాస్టిక్ గోదాం ఉండడంతో మంటలు పెద్ద ఎత్తున్న వ్యాపించాయి.షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు.అయితే ఆస్థి నష్టం తప్ప ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని పోలీసులు తెలిపారు.ఈ కేసును అఫ్జల్‌గంజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**-నెలలు నిండి పసికందును కాపాడిన అగ్నిమాపక దళం:**

సిద్దింబర్‌బజార్ ముక్తార్‌గంజ్‌లోని భవనంలో జరిగిన అగ్నిప్రమాదం సంభవించడంతో అందులో ఉన్నవారు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అర్తనాదాలతో అరుపులు,కేకలు పెడుతున్నారు.నిద్రిస్తుండగాఒకేసారి పొగలు కమ్ముకోవడంతో ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నారు.అప్పటికే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక దళం ఫైరింజన్ల ద్వారా మంటలను ఆర్పూతూ భారీ ల్యాండర్‌ను రంగంలోకి దింపి చాకచాక్యంగాచిన్నారితోపాటు వృద్దురాలు,మరోనలుగురిన్ని మొదటి,రెండవ అంతస్తు నుంచి కిందకు తీసుకువచ్చి వారిప్రాణాలను కాపాడారు.చిన్నారితోపాటు మిగతా కాపాడినందుకు అగ్నిమాపక సిబ్బందిపై ప్రజలు శబాష్ అంటూ ప్రశంసలు కురిపించారు.అప్పటికే షాపులు తెరువక పోవడంతో అగ్నిమాపక దళానికి సులువు తరంగా మారింది.షాపులు తెరిచి వ్యాపార లావాదేవీలు జరిగే సమయంలో అయితే చాలా వరకు ఇబ్బందిపడే అవకాశం ఉండేది.మంటలు వ్యాపించడంతో ప్రజలు ఉరుకులు,పరుగులు పెట్టారు.కాగా ప్రమాదం సంభవించిన స్థలానికి స్థానిక కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్ చేరుకుని అగ్నిప్రమాదం జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించక పోవడంతో అటు పోలీసులు,ఇటు ఫైరింజన్ అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# బుల్కాపూర్ నాలాకు "హైడ్రా" గేట్లు

**-గండిపేటకు తప్పిన మురుగు ముప్పు**



హైడ్రా ఆధ్వర్యంలో గేట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** జంటనగరాలకు తాగు నీరు అందించే గండిపేట(ఉస్మాన్‌సాగర్)కు మురుగు ముప్పు తప్పింది. ఖానాపూర్, నాగులపల్లి నుంచి వచ్చిన మురుగు నీరు బుల్కాపూర్ నాలా ద్వారా గండిపేటలోకి వెళ్లకుండా హైడ్రా చర్యలు తీసుకుంది. రూ. 2 లక్షలు వెచ్చించి బుల్కాపూర్ నాలాకు కొత్త షట్టర్లను ఏర్పాటు చేసింది. వరద వచ్చేటప్పుడు గండిపేటకు చేరేలా కాలువకు ఉన్న షట్టర్లు (గేట్లు) శిథిలమైన విషయం విధితమే. మురుగు నీరు గండిపేటలో కలుస్తున్నదని మీడియాలో వచ్చిన కథనాలపై హైడ్రా స్పందించింది. అధికారుల బృందంతో కలిసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెంటనే షట్టర్ల మరమ్మతులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శిథిలమైన షట్టర్ల స్థానంలో కొత్తవి అమర్చడంతో మురుగు నీరు గండిపేట చెరువులోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే బుల్కాపూర్ నాలాలో పూడికపోయిన చెత్తను కూడా కొంతమేర తొలగించి మురుగు నీరు ముందుకు సాగేలా ఏర్పాట్లు చేశారు. ఒకప్పుడు వరద కాలువగా ఉన్న బుల్కాపూర్ నాలాలో పైన ఉన్న నివాసాలు, వాణిజ్య సముదాయాలు, రిసార్టుల నుంచి మురుగు నీరు ప్రవహిస్తోంది. శంకరపల్లి లోని బుల్కాపూర్ చెరువు నుంచి ఖానాపూర్, కోకాపేట, నార్సింగ్, పుప్పాలగూడ, మణికొండ, దర్గా, షేకేపేట్, టోలి చౌకి, పోచమ్మ బస్తీ, చింతలబస్తీ మీదుగా హుస్సేన్ సాగర్‌కు వర్షపు నీరును తీసుకెళ్లే చరిత్ర ఈ నాలాది. బుల్కాపూర్ నాలాను పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తే చాలా ప్రయోజనాలుంటాయని.. హుస్సేన్ సాగర్‌కు వర్షపు నీటిని తీసుకువచ్చే ఏకైక నాలాగా దీనికి ప్రత్యేక స్థానం ఉందని స్థానికులు గుర్తు చేశారు.

## తరగతిగదిలోని ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు దృష్టిసారించాలి

**-పఠన స్థాయి పెంచి ప్రతి ఒక్కరూ చదివేలా తీర్చిదిద్దాలి**

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, డీఈవో రోహిణి తదితరులు

**హైదరాబాద్, మే 15,ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రతి పాఠశాల తరగతి గదిలోని ప్రతి పిల్లవాడు చదవగలిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సాధించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈమేరకు గురువారం నాంపల్లి అలియా ప్రభుత్వ మోడల్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఉపాధ్యాయులకు విద్యా బోధన సామర్థ్యాలను పెంపొందించే దిశగా ఏర్పాటుచేసిన 5 రోజుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ విద్యార్థులలో రీడింగ్, రైటింగ్ బేసిక్‌లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పిల్లలు ఎక్కువ జ్ఞానం, నైపుణ్యాలను పెంచడానికి శిక్షణ యొక్క ప్రాముఖ్యతను అలాగే పాఠశాలలలో అభ్యాసాలు అమలు వ్యూహాలను ఈ సందర్భంగా చర్చించారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉన్నందున నాణ్యమైన విద్యా బోధన చేయాలని ఆయన సూచించారు. ఇలాంటి సదస్సులు ద్వారా విద్యా ప్రమాణాల అంశాలపై ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు చర్చించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు పిల్లల పఠన స్థాయి పెంచాలని, ప్రతి పాఠశాలలో చదవడం రాని పిల్లలు మా పాఠశాలలో లేరు అని డిక్లేర్ చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూర్చటంతో పిల్లల హాజరు శాతం గణనీయంగా పెరిగిందన్నారు. ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో పిల్లలు 90 మార్కులకు పైగా సాధించటంతో ఈ సందర్భంగా అభినందించారు. దివ్యాంగులైన విద్యార్థులకు వారి వైకల్యంబట్టి ప్రత్యేక శ్రద్ధతో బోధన చేసి హైదరాబాద్ జిల్లాను ఉన్న స్థాయిలో నిలబెట్టాలని సూచించారు. ఈ సదస్సులో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి, డైట్ ప్రిన్సిపాల్ రవికాంత్ రావు, ఎస్ఆర్పీలు నాగరాజు,బాలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రేటర్‌లో 24 బార్‌లకు దరఖాస్తుల స్వీకరణ

**-మార్గదార్శకాలు విడుదల చేసిన ఎక్సైజ్‌శాఖ**

**-జూన్ 6 వరకు స్వీకరణ ..13న కేటాయింపు**

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** దరఖాస్తుల డ్రా.జీహెచ్ఎంసీ పరిధిలో 24 బార్లకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది.ఈ బార్లకు దరఖాస్తులు చేసుకొనే వారికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి? ఏ ఫారాలు జత చేయాలి?ఎంత డబ్బులు కట్టాలి?దరఖాస్తులను ఎక్కడ ఇవ్వాలి?అనే అనుమానాలను నివృత్తి చేసేందుకు రంగారెడ్డి,హైదరాబాద్‌డిప్యూటి కమిషనర్లు పి.దశరథ్, కే.ఏబీ శాస్త్రీ పలు సూచనలు చేశారు. ప్రధానంగా దరఖాస్తులతోపాటు రూ. లక్ష డి.డి, చాలన్ ద్వారా చెల్లించి సంబంధిత చాలన్, డి.డిని దరఖాస్తుతో జత పర్చాలని తెలిపారు. దాంతో పాటు మూడు కలర్ ఫోటోలు, పాన్ కార్డు, అధార్‌కార్డు జత పర్చాలని సూచించారు. జిహెచ్ఎంసీ పరిధిలోని 24 బార్ల దరఖాస్తులను నాంపల్లి ఎక్సైజ్ ప్రధాన కార్యాలయంలోని రంగారెడ్డి డిప్యూటి కమిషనర్ 5 ఫ్లోర్, హైదారాబాద్, డిప్యూటి కమిషనర్ మొదటి అంతస్తులో, సరూర్‌నగర్ జల్‌పల్లి మునిసిపాలిటీకి చెందిన బార్‌దరఖాస్తులు 4వ ఫ్లోర్ డిబ్లాక్ లోని సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరిండెంట్‌కు ఇవ్వాలని తెలిపారు.జూన్ 6 వరకు దరఖాస్తులను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తామని జూన్ 13న డ్రా నిర్వహించి బార్ల కేటాయింపులు జరుపుతామన్నారు. దరఖాస్తులపై అనుమానాలు ఉంటే 8712658723 లేదా సరూర్‌నగర్, శంషాబాద్, మేడ్చల్,మాల్కాజి గిరి ఎక్సైజ్ సూపరిడెంట్లకు ఫోన్లు చేసి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చునని సూచించారు.

## జిల్లాలకు, ఇతర శాఖలకు ఉద్యోగులను నియమించాలి

**-సిఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

**సైఫాబాద్, మే 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 6 సంవత్సరాల క్రితం కొత్తగా ఏర్పడ్డ 23 జిల్లాలకు, వాటికి అనుబంధంగా ఏర్పడ్డ వివిధ శాఖలు, కార్యాలయాలకు వెంటనే ఉద్యోగులను నియమించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు లేక లక్షలాది మంది విద్యావంతులైన నిరుద్యోగులు నిరాశ, నిస్పృహాల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నాడిక్కడ బిసి కార్యాలయంలో రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్, బిసి నేత జి.అనంతయ్య ఆధ్వర్యంలో జరిగిన నిరుద్యోగుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొత్తగా ఏర్పడ్డ 23 జిల్లాలకు, వాటిలోని 40 శాఖల జిల్లా కార్యాలయాలు, అలాగే పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన తాలుకాలు, 131 మండలాలు, 30 రెవిన్యూ డివిజనల్ కార్యాలయాలు, 76 మున్సిపాలిటిలు, 7 మున్సిపల్ కార్పోరేషన్‌లు, 25 డిఎస్పీ కార్యాలయాలు, 31 పోలీస్ సర్కిల్స్, 7 పోలీస్ కమిషనరేట్‌లు, 4,383 గ్రామపంచాయితీలు ఏర్పడ్డాయని చెప్పారు. ఇందులో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 సర్వీస్ పోస్టులు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయని, కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు, మండలాలకు, మున్సిపాలిటీలకు పోస్టులు మంజూరు చేయలేదని, వీటికి పోస్టులు వెంటనే మంజూరు చేయాలని, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటాలో లెక్కించాలని, వీటిలో గ్రూప్-1లో 50 శాతం, గ్రూప్-2లో 30 నుంచి 40 శాతం వరకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద ఎన్ని పోస్టులు వస్తాయో పూర్తి స్థాయిలో లెక్కించి భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక దఫా గ్రూప్1, 2, 3, 4 పోస్టులు, టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేస్తున్నందువల్ల మెరిట్ అభ్యర్థులు ఈ పోస్టులన్నింటికి సెలెక్ట్ అవుతారని, ఒక్కొక్క అభ్యర్థి 6, 7 కేటగిరీల పోస్టులకు సెలెక్ట్ అయితే ఆ అభ్యర్థిని ఒక పోస్టులో ఎంపిక చేసుకుంటారని, మిగతా 5, 6 రకాల పోస్టులు మిగిలిపోతాయని, ఇప్పుడున్న పద్ధతి ప్రకారం ఇతర అభ్యర్థులకు రాకుండా పోతాయని ఆయన వివరించారు. సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు సి.రాజేందర్, జిల్లపల్లి అంజీ, రాందేవ్, రాజు, నందగోపాల్, బాలయ్య, సిఎం రావు తదితరులు పాల్గొనా న్నరు.

## వెంటాడి వేటాడి పట్టపగలే హత్య



హత్యకు గురైన అయాన్ ఖురేషీ

**బేగంబజార్,మే 15 ప్రభాతవార్త:** నగరంలో ఏదో ఒక చోట హత్యలు జరుగుతనే ఉన్నాయి. పరువు హత్యలు,పాతకక్షలతో జనార్యణంలో హత్యలు జరుగుతున్నాయి. గుంపులు, గుంపులుగా ఉన్న ప్రజలు కూడా ఏమి చేయలేకపోతున్నారు.పాతబస్తీ పూల్‌బాగ్ ప్రాంతానికి చెందిన అయాన్ ఖురేషీ(24),గురువారం ఉదయం యాక్టివాపై వెళ్తున్నాడు.పని నిమిత్తం వెళ్తున్నప్పటికి ఆయాన్‌ను ఐదుమంది వెంబడిస్తున్నట్లు గమనించలేదు.తన ద్విచక్రవాహనంపై ఎం.ఎన్.జె క్యాన్సర్ ఆసుపత్రి ముందు రహదారిపై వెంటాడి,వెంటాడిన గుర్తు తెలియని ఐదు మంది వెంట తెచ్చుకున్న కత్తులను తీసి మూకుమ్మడిగా ఆయాన్ ఖురేషీపై విచక్షణ రహితంగా కత్తులతో దాడి చేసి పోడిచి హత్య చేశారు.ఒకేసారి కత్తులతో దాడి చేయడంతో ఖురేషీఎం.ఎన్.జె క్యాన్సర్ ఆసుపత్రి ముందు రక్తం మడుగుల కూప్ప కూలిపోయాడు. వైద్యకోసం వచ్చిన వారు,రోగి సహాయకులు కూడా చూస్తు బయంతో పరుగులు తీశారు.హత్యచేసిన గుర్తు తెలియని వ్యక్తులుసంఘటన స్దలంలోనే కత్తులను వదిలి పారిపోయారు.హత్య విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్దలానికి చేరుకుని హత్యకు గురైన వివరాలను సేకరించారు.అక్కడి క్లూస్‌టిమ్ కూడా వచ్చారు.మృతదేహానికి శవ పంచనామా జరిపి పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.ఆయాన్ ఖురేషీని పాతకక్షలతోనే హత్య చేసి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.అక్కడ వదిలి వేసిన కత్తులను స్వాధీనం చేసుకున్నారు.ఖురేషీపై కత్తులతో దాడి చేసిన దృశ్యాలు సిసిపుటేజ్‌ల రిక్డార్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని హంతకుల ముఖ చిత్రాలను పరిశీలించి వారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది.హత్యచేసిన నిందితులను పట్టుకునేందుకుగాను టాస్క్‌ఫోర్స్ బలగాలతోపాటు నాంపల్లి పోలీసులు రెండు బృందాలను రంగంలోకి దింపినట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసును నాంపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌లా... 'ఆన్ ది వే సైబర్ క్రైం'

**- కొత్తతరహా మోసాలతో నేరాలు - వృద్ధులు, విద్యార్థులపై వల**



**హైదరాబాద్, మే15, ప్రభాతవార్తః** మేధావులైనా..విద్యావంతులైన...అక్షరముక్కరాని అమాయకులైన సైబర్ నిందితులు అల్లే పిట్టకథలకు పడిపోవాల్సిందే.. మాట్లాడుతుంటూన్నే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు టక్..టక్ సౌండ్‌తో ఖాళీ అవుతుంటాయి..ఇదే సైబర్‌నేరస్తుల జిమ్మిక్కులు....అప్రమత్తం లేకపోతే ఎవరైనా మోసాపోవాల్సిందే... ఇప్పుడు ట్రెండ్ మార్చి కొత్త తరహ నేరాలతో వలపన్నారు. వృద్ధులు, విద్యార్థులను టార్గెట్ చేస్తూ లూటీ చేస్తున్నారు. ఆ తర్వాత ఎంత లబోదిబో అన్న ప్రయోజనం ఉండకపోవచ్చనే పోలీసులు చెబుతున్నారు. నిందితులను దొరికితే రికవరీ అవొచ్చు.. కాకపోవచ్చు.. ఏమైన జరిగితే అదృష్టంపైనే ఆధారపడి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

### వృద్ధులు..విద్యార్థులపై వల...

గత నెలలో ఏడుగురు వృద్ధులను టార్గెట్ చేసి మాయమాటలతో రూ.లక్షల రూపాయాల దోపీడికి పాల్పడ్డారు. అంతరాష్ట్ర నేరస్తులే ముఠాగా ఏర్పడి పొరుగు రాష్ట్రాలు, ఢిల్లీ వేదికగా నేరచేతివాటం ప్రదర్శిస్తున్నారు సైబర్ నేరగాళ్లు. వృద్ధాప్య పింఛను ఖాత హ్యాంగ్ అయిందని నగరానికి చెందిన ఓ వృద్ధుడిపై ప్రభుత్వ అధికారినంటూ నమ్మించి బ్యాంకు వివరాలను సేకరించారు. మరొకరికి క్రాప్‌లోన్ అంటూ ఖాతా లూటి చేశారు. ఇంకొకరికి జీపే, ఫోన్‌పేలే వాడలంటూ రిజిస్ట్రేషన్ చేస్తూ మోసగించారు. ఇలా ఏడుగురి నుంచి లక్షల రూపాయాలు కొల్లగొట్టారు. ఇక విద్యార్థులకు కొత్తవిధానం అనుసరిస్తూ ఇంగ్లీష్ భాషతో మాట్లాడుతూ మస్కా కొడుతున్నారు. వాట్సాప్ ఛానల్ చూస్తే డబ్బులు వస్తాయని ఆశలు రేకెత్తిస్తున్నారు. సోషల్‌మీడియాలో సైతం స్మార్ట్‌ఫోన్ ఉంటే వేల రూపాయాలు సంపాదించవచ్చని, రోజువారిగా నగదు బ్యాంకుకు బదిలీ అవుతాయని చెప్పి రిజిస్ట్రేషన్ కింద రూ. 200ల జమ చేయించుకుని ఖాతా నెంబర్ చెప్పగానే ఉన్న డబ్బులు ఊడ్చుకపోయాయి. మోసపోయారని గ్రహించి ఇటీవల సీసీఎస్ పోలీసులను ఆశ్రయించాడు సదరు విద్యార్థిని. ఇలా పలువురు కూడా వరుస ఫిర్యాదులు అందుకుంటున్నారు.

### నకిలి లింక్‌లతో జాగ్రత్త...

వాట్సాప్, ఎస్సెమ్మెస్‌లతో నకిలీ లింక్‌లు నెంబర్లకు పంపి సైబర్‌నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. పొరబాటున ఓపెన్ చేస్తే బ్యాంకు వివరాలన్ని సదరు నేరస్తుడి చేతిలోకి వెళ్లిపోతాయని పోలీసులు చెబుతున్నారు. ఏపీకేతో వచ్చే లింక్‌లన్ని ఫేక్ అని గుర్తుపెట్టుకోవాలి. ఏదీ కూడా సులువుగా డబ్బులు బదిలీకావని తెలుసుకోవాలి. అవసరాన్ని ఆసరగా చేసుకొని ఆర్థిక సమస్యలకే సరి తూగేవిధంగా మాటలను కలుపుతూ నిలువున ముంచుతున్నారు. బ్యాంకులో ఉన్న వందలు, వేల రూపాయాలు కూడా మనకు తెలియకుండానే ట్రాన్స్‌ఫర్ అవుతాయని గ్రహించాలని సూచిస్తున్నారు. గుర్తుతెలియని నెంబర్‌లతో మరింత జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

వార్త, హైదరాబాద్ శుక్రవారం 16, మే 2025

## ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో సానుకూలతను పెంపొందిస్తాయి : రాజేశ్వరరావు



లక్ష్మీ ్మ విజయ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కెపిహెచ్బి కాలనీ, మే 15, ప్రభాతవార్త**

ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో సానుకూలతను పెంపొందిస్తాయని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఫిరోజ్ గూడ నవజీవన్ నగర్‌లోని శ్రీశ్రీశ్రీ విజయ గణపతి సహిత ఉమ మహేశ్వర స్వామి వార్ల దేవాలయములో నూతన లక్ష్మీ విజయ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు ఈ పుణ్యకార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజేశ్వరరావుని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలోని సానుకూలతను పెంపొందిస్తాయనీ దేవాలయాల అభివృద్ధి ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శంకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి, బాలానగర్ బీజేపీ సీనియర్ నాయకులు రమేష్, శ్రీశైలం, శివరంజని, డివిజన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఇతర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెను విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

**అడ్డగుట్ట, మే 15 ప్రభాతవార్త:**

మే 20న దేశ వ్యాప్త జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తుకారం గేట్ లేబర్ అడ్డా వద్ద బావన నిర్మాణ కార్మికులతో కలిసి సిఐటియు సికింద్రాబాద్ జోన్ నాయకులు ఆర్.మల్లేష్, గోపాల్ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికులు, కర్షకులు జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నదని అన్నారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాలలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను ముందుకు తెచ్చిందన్నారు. దేశవ్యాప్త నాలుగు లేబర్ కోడ్లను వాపస్ తీసుకోవాలని, ఇంద్ర పార్క్ వద్ద జరిగే ధర్నాకు ప్రతి కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవయ్య,బరవి, దానయ్య, సాయిలు, మల్లేష్, రమేష్, రాజయ్య, మన్యం, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ డేకేర్ రూమ్‌ను ఏర్పాటు చేయాలి




జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్, మే 15 ప్రభాతవార్త:**

మారేడ్‌పల్లిలో సీనియర్ సిటిజన్స్‌కు డే కేర్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ మోండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దాకునాయక్‌లకు వినతి పత్రం సమర్పించారు. 2017 నుంచి డేకేర్ రూమ్ పెండింగ్‌లో ఉందని, వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ మారేడ్‌పల్లి అధ్యక్షుడు వెంకట్‌రావు, కార్యదర్శి నర్సింగ్‌రావు, జాయింట్ సెక్రటరీ వీరారెడ్డి, మాజీ అధ్యక్షుడు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలు కాపాడేందుకు సహకరించాలి



గోషామహల్ సిఐ శ్రీనివాసులును సన్మానిస్తున్న సేనా అధ్యక్షులు లక్ష్మన్‌రావు గుప్త

**గోషామహల్,మే 15ప్రభాతవార్త:**

శాంతి భద్రతలను కాపాడేందుకు గాను ప్రజలు పోలీసులకు సహకరించాలని గోషామహల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఇన్‌స్పెక్టర్‌గా పదవిబాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు గుప్త మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సునీల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులు వెంటనే పూర్తి చేయాలి : ఆనంద్‌గౌడ్

**గోషామహల్,మే 15ప్రభాతవార్త:** చుడీబజార్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని గోషామహల్ నియోజవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మునుకుంట్ల ఆనంద్‌కుమార్‌గౌడ్ జిహెచ్ఎంసి కమీషనర్ కర్ణన్‌ను డిమాండ్ చేశారు. ఈ మేరకు మాదిగ బంధు మిత్రమండలి,సిపిఎం నాయకులు దళిత నాయకులతో కలిసి చుడీబజార్ ఫంక్షన్ హాల్‌ను తనిఖీ చేసి పరిశీలించారు. గత కొన్ని ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న చుడీబజార్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులను వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాధికాకు విన్నవించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులు నిలిచి పోయినందున,వేరే కాంట్రాక్టర్‌కు మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులను అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 2016లో అప్పటి దివంగత మాజీ మంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి చొరవతో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణా పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎందుకు మిగిలిపోయిన పనులను పూర్తి చేయడానికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పనులు పూర్తి చేసిన తరువాత మాదిగ బంధు మిత్ర మండలికి అప్పగించాలన్నారు. రౌండ్ సమావేశంలో బొయిని ఎల్లేష్‌మాదిగ, ఉపాధ్యక్షులు ఎం.వెంకటేష్, గడ్డం యాదగిరి, రామ్ ప్రసాద్, ఎన్.శ్రీరాములు, పి, నాగేశ్వర్, సుమన్‌కుమార్, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్య పార్కు అభివృద్ధికి చర్యలు



బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్‌కుమార్‌యాదవ్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పివి.నిరంజన్‌రెడ్డి

**చిక్కడపల్లి, మే 15 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కును రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్‌కుమార్ యాదవ్ గురువారం మరోసారి సందర్శించారు. ఈ సందర్భంగా పార్కు గురించి వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పివి.నిరంజన్‌రెడ్డి నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ తన ఎంపి నిధుల నుంచి ఉపయోగించి పార్కు అభివృద్ధికి అండగా నిలుస్తానన్నారు. పార్కులో షటిల్ కోర్టు పునరుద్ధరణ, పిల్లల ఆట పరికరాల ఏర్పాటు చేయడంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తానన్నారు. సుందరయ్య పార్క్ మౌలిక సదుపాయాల అభివృద్ధి విషయంలో అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానన్నారు. పార్కు అభివృద్ధికి నిధుల కేటాయించే విషయంలో సానుకూలంగా స్పందించిన ఎంపి అనీల్‌కుమార్‌యాదవ్‌కు క్లబ్ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, కోశాధికారి దశరథ, ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు నాగభూషణం, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ఏవీపీ ఎస్.మురళీ కృష్ణ, క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎస్.రమేష్ రెడ్డి, అంబటి శ్రీనివాస్ రెడ్డి, ఆర్.వివేక్, గవర్నర్ కార్యదర్శి శైలజా మోహన్, కాంగ్రెస్ నాయకులు కాసాని ఆనంద్, అంజియాదవ్, నవీన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ ఎంతో పురాతనమైంది : సిరికొండ మధుసూదనాచారి



గురువారం త్యాగరాయ గానసభలో ఆదర్శ కుటుంబం అవార్డులను ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 15 ప్రభాతవార్త:** ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ ఎంతో పురాతనమైనదని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ప్రతి పక్షనేత సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో అంతర్జాతీయ కుటుంబాల దినోత్సవం సందర్భంగా ప్రముఖులకు ఆదర్శ కుటుంబం అవార్డుల ప్రదానోత్సవం సభ నిర్వాహక సంస్థ అధినేత కె.మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆదర్శ కుటుంబం అవార్డు గ్రహీతలు శోభ, డాక్టర్ రామచంద్రరావు, మాధవి, వై. శ్రీనివాసులు, రేణుక, డాక్టర్ మధుసూదన్ రావు, బత్తిన పద్మ నరసింహులు గౌడ్, సుజాత శంకర్, ఆమంచ అంజయ్యలను ఆదర్శ కుటుంబ అవార్డులతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, సినీ దర్శకులు డాక్టర్ నిట్టల గోపాలకృష్ణ, రిటైర్డ్ జడ్జి డాక్టర్ బూర్గుల మధుసూదన్ రావు, కార్పొరేటర్ ట్రైనర్ సర్వేపల్లి గోపికృష్ణ, కవయిత్రి డాక్టర్ రాధా కుసుమ, నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు పాల్గొన్నారు.

# కన్నులపండువగా సాగిన శ్రీవారి గజవాహనసేవ

**చిక్కడపల్లి, మే 15 ప్రభాతవార్త:**



గజవాహనసేవ సేవలో భాగంగా పూజలు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం మళయప్పస్వామి గజవాహనసేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పాంచరాత్రాగమ శాస్త్రోనుసారంగా క్షేత్రసాంప్రదాయంగా అలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్-కీర్తి దంపతులు, ఈవో, సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ ఆధ్వర్యంలో జపహోమ, పూజ, అర్చనాది సేవలతో ధార్మిక ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఉత్సవాల్లో భాగంగా సుప్రభాతసేవ, బిందె తీర్థం, హవనము, బలిహరణము, బాలభోగము, మంత్రపుష్పం, తీర్థప్రసాదాన్ని భక్తులకు అందించారు. అనంతరం మహానివేదన, మంత్రపుష్పం పూర్తయిన తర్వాత వేదపారాయణము, ద్రావిడ ప్రబంధము భేరిపూజ, మహనివేదన అనంతరం వాహన సేవ జరిగింది.

**నేడు గజవాహనసేవ**

కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీనివాసుడి కల్యాణమహోత్సవం ఉంటుందని ఆలయం అలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో, సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ వివరించారు. ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందెతీర్థము, హవనము, బలిహరణం, బాలభోగము, మంత్రపుష్పము, పల్లకీసేవ, మహానివేదన, వేదపారాయణాలు, ద్రావిడ ప్రబంధము ఉంటుంది.సాయంత్రం మహానివేదన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం అనంతరం ఎదుర్కోళ్ళు, రాత్రి స్వామివారి కల్యాణం ఉంటుంది.

# వర్షంనీరు వెళ్లేలా పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి

-వర్షం పడినప్పుడల్లా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
-సమస్యను తీర్చాలని జోనల్ కమిషనర్‌కు బిజెపి నేతల వినతి



**అత్తాపూర్ మే15,ప్రభాతవార్త :**

అత్తాపూర్ డివిజన్‌లోని శివాజీ నగర్, నంది ముస్లాయిగూడ సాయిబాబా గుడి ముందు చౌరస్తా దగ్గర వర్షం కురిసినప్పుడలా వర్షం నీరు ఇళ్ళలోకి మోకాళ్ళ వరకు వస్తున్నాయని పలువురు బిజెపి నేతలు పేర్కొన్నారు. గురువారం రాజేంద్రనగర్ బిజెపి నేతలు ఈ విషయమై పెద్ద పైపులైన్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నౌ నంబర్ పాండురంగ నగర్ హుడా కాలనీ నుండి వర్షం కురిసినప్పుడు నీరు అన్నీ కూడా అత్తాపూర్ డివిజన్ లో ని శివాజీ నగర్ దగ్గర చేరి చెరువులాగా నిండి ఇళ్లలోకి చేరుతున్నాయని వివరించారు. వర్షం పడ్డప్పుడల్లా రోడ్లన్నీ నిండి ఎటు పోనీ పరిస్థితి ఏర్పడుతున్నదని శివాజీ నగర్ దగ్గర వాటర్ వెళ్లడానికి పైపులు చిన్నగా ఉన్నందున ఓపెన్ మాన్యువాల్స్ సరిగా లేనందున ఈ సమస్య ఉత్పన్నమవుతుందని సూచించారు. అదేవిధంగా ఎన్ ఎం గూడా సాయిబాబా గుడి ముందు చౌరస్తా దగ్గర కూడా వర్షం నీళ్ళతో మెయిన్ రోడ్డు పూర్తిగా నిండి వాహనాలకు ప్రజలకు చాలా ఇబ్బందికరంగా మారిందని కావున వెంటనే శివాజీ నగర్, సాయిబాబా గుడి ముందు నుండి మూసిలోకి వర్షపు నీరు వెళ్లే విధంగా పెద్ద పైప్ లైన్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు .సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలోనే పనులు చేపడతామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మోండ్ర కొమురయ్య, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ సాబాధ విజయ్ కుమార్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సులిగె వెంకటేష్, సీనియర్ నాయకులు పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, ఎస్. బీ. హరినాథ్ పాల్గొన్నారు.

# నకిలీ ఆధార్ కార్డులను సృష్టించి స్థలాన్ని కాజేయాలనే కుట్ర

-పోలీసులకు అబ్దుల్లాపూర్‌మెట్ సబ్‌రిజిస్ట్రార్ ఫిర్యాదు

**అబ్దుల్లాపూర్ మెట్, మే 15, ప్రభాతవార్త :**

చనిపోయిన వ్యక్తి స్థానంలో వేరే వ్యక్తిని చేర్చి నకిలీ ఆధార్ కార్డును సృష్టించిన కేటుగాళ్లు ఓ ప్లాటును తమ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు పన్నాగం పన్నారు. ఆధార్ కార్డుపై మార్ఫింగ్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చిన ముఠా సభ్యుల తీరుపై అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్ ఆధార్ కార్డును పరిశీలించగా నకిలీ అని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేసి ఇద్దరు వ్యక్తులను పోలీసులకు అప్పగించారు. అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి......నగరంలోని గోషామహల్‌కు చెందిన చంద్రకాంత్ అనే వ్యక్తికి అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధి మజీద్‌పూర్ గ్రామంలో ఉన్న 267 గజాల స్థలాన్ని మనకర్ ఆనంద్ అనే వ్యక్తి జీపీఏ (866/2013) చేయించుకున్న కొన్ని నెలలకే ఆనంద్ మృతిచెందాడు. ఈ విషయాన్ని గుర్తించి ఆ స్థలాన్ని కాజేయాలని చంపాపేటలో నివాసముండే కొసిరెడ్డి భాస్కర్‌రెడ్డి (సస్పెండ్‌కు గురైన ఆర్టీసీ ఉద్యోగి) పన్నాగం వేశాడు. ఈ క్రమంలో ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా గోనకోల్కు చెందిన బోదాసు ఆంజనేయులును ప్లాట్ యజమాని ఆనంద్‌గా చూపించేందుకు నకిలీ ఆధార్ కార్డు సృష్టించాడు. అదేసమయంలో వరంగల్ లోని బలపాలకు చెందిన జిల్లాపల్లి సంజీవరావును చంద్రకాంత్‌గా చూపించేలా మరో ఆధార్ కార్డును సృష్టించాడు. సాక్షులుగా గోనకోల్కు చెందిన దండుగల ఆంజనేయులు, చంపాపేట్‌లో ఉంటున్న కురువ శ్రీనివాసులును తీసుకెళ్లాడు. వీరందరి నుంచి భాస్కర్‌రెడ్డి కొనుగోలు చేస్తున్నట్టు డాక్యుమెంట్ రైటర్ ఉదయ్‌కుమార్ ద్వారా డాక్యుమెంట్ సిద్ధం చేసుకున్నాడు. బుధవారం రిజిస్ట్రేషన్ చేసుకునే సమయానికి ఆధార్ కార్డుల నెంబర్లు నమోదు చేసే సమయంలో బయోమెట్రిక్‌లో అసలు వ్యక్తులకు, నకిలీ వ్యక్తులకు సరి చూపలేదు. బయోమెట్రిక్ సమయంలో ఆనంద్ పేరుతో ఉన్న ఆధార్ కార్డు నంబరు నమోదు చేయగా ఆంజనేయులు పేరు. చంద్రకాంత్ పేరిట ఉన్న ఆధార్ కార్డును నమోదు చేయగా సంజీవ పేర్లు రావడంతో సబ్‌రిజిస్ట్రార్ సునీతా రాణికి అనుమానం వచ్చి నకిలీ ఆధార్‌కార్డులు సృష్టించి మోసం మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈమేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ రెడ్డి తెలిపారు. ఏ1గా ఉన్న భాస్కర్‌రెడ్డి. ఏరి శ్రీని వాసులును పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

## అనుమానంతో భార్యను కడతేర్చిన ఆటో డ్రైవర్

**సరూర్‌నగర్, మే 15 ప్రభాతవార్త:** తన భార్యపై అనుమానం పెంచుకున్న ఓ ఆటో డ్రైవర్ అతి దారుణంగా హతమార్చాడు. ఈ సంఘటన నగర శివార్లలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గోల్కొండ ప్రాంతానికి చెందిన జాకీర్ అహ్మద్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. అయితే పనె న్డేళ్ళ క్రితం నాజియా బేగం (30)ను వివాహం చేసుకోగా వారికి ముగ్గురు సంతానం కలిగారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో నాజియా ప్రైవేటు ఉద్యోగానికి కుదిరింది. అయితే ఇటీవల కాలంగా ఆమెపై అనుమానం పెంచుకున్న జాకీర్ తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో మే మొదటి వారంలో బాలాపూర్ పిఎస్ పరిధిలోని కొత్తపేట్ న్యూ గ్రీన్ సిటీ కాలనీకి మకాంను మార్చాడు. అయితే మంగళవారం రాత్రి గొడవ జరగగా జాకీర్ కర్రతో భార్య తలపై మోదడమే కాకుండా గాజులతో గాయపరిచాడు. అనంతరం చున్నీతో గొంతుకు బిగించి హతమార్చాడు. హత్య చేసిన అనంతరం పారిపోయిన జాకీర్ అత్తకు ఫోన్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

సంఘటనా ప్రాంతానికి వచ్చిన అత్త రుబీనా హతో ్యదంతంపై బాలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్స్‌పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతున్నది.

## సంఘసేవ పరమార్ధంగా జీవించిన సరసిజదేవి : డా. కృష్ణమోహన్‌రావు




బిసి మేధా పురస్కారంతో వకుళాభరణం కృష్ణమోహన్‌రావును సత్కరిస్తున్న ఆదినారాయణ, ధనలక్ష్మి, ఆశాలత, శశిబాల తదితర ప్రముఖులు

**రవీంద్రభారతి, మే 15 ప్రభాతవార్త :** సంఘసేవా జీవిత పరమార్ధంగా తన జీవితాన్ని సామాజికసేవకే అంకితం చేసిన పోతుమంచి సరసిజదేవి ప్రతీఒక్కరికి స్ఫూర్తి ఆదర్శప్రాయమని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ మాజీ అధ్యక్షుడు డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. సంఘసేవలో ఉన్న ఆనందం సంతృప్తి మేరేయితర సేవల్లో లభించడదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో మీట్ మీ అబ్రాడ్ ఓవర్సీస్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఈరోజు మధ్యాహ్నం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముందుగా కళాకారులు సరసిజదేవికి సంగీత నృత్యనీరాజనం కావించారు. అనంతరం సంస్థ డైరెక్టర్ పి.ధనలక్ష్మీ నిర్వహణలో జరిగిన సభలో విచ్చేసిన ప్రముఖులు డా. ఎస్.ఆదినారాయణ, ఆశాలత, చేబ్రోలు శశిబాల, ధనలక్ష్మి తదితరులు బిసిల హక్కుల కోసం దశాబ్దాలుగా అశేషకృషి చేస్తున్న ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త, రచయిత, రాష్ట్ర బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావును శాలువా, పుష్పమాల, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి బిసి మేధా పురస్కారం ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. వకుళాభరణం స్పందనలో ఈ గౌరవాన్ని వ్యక్తిగతం కాక తనమీద ఉంచిన విశ్వాసానికి ప్రతీక, బిసి హక్కుల పోరాటంలో ఇదొక ప్రేరణాత్మక మైలురాయని భావిస్తూ మున్ముందు కూడా బిసిల హక్కుల సాధన కోసం అవిరళ కృషిచేస్తానని భరోసానిచ్చారు. సామాజికసేవకు స్ఫూర్తిగా నిలిచిన సరసిజాదేవి జయంతిని పురస్కరించుకొని ముఖ్యఅతిథి డా. వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు పలువురు పేద విద్యార్థులకు విద్యా ప్రోత్సాహకం కింద ఆర్థిక సహాయ చెక్కుల పంపిణీ; 10మంది ది వ్యాంగులకు ఉచితంగా వీల్‌ఛైర్స్; సామాజికరంగంలో విశిష్ట సే వలందించిన వ్యక్తులకు సేవారత్న అవార్డులు అందజేసి ఆమె సేవానిరతికి నివాళిగా ఈ వితరణలు ప్రశంసనీయమని కొనియాడారు.

# హత్య కేసులో నిందితుడు అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్ రావు, సీఐ రాజశేఖర్ రెడ్డిలు

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

కేపీహెచ్బీ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 12వ తేదీన జరిగిన హత్య కేసులో నిందితుడిని కేపీహెచ్బీ పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. కేపీహెచ్బీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్ రావు, సీఐ రాజశేఖర్ రెడ్డిలు వివరాలు వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన కేపీహెచ్బీ కాలనీ సర్దార్‌పటేల్ నగర్‌లోని కేఎస్ఆర్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ వద్ద కల్ల వెంకటరమణ(32)ను ఓ యువకుడు కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పంపెన అయ్యప్ప స్వామి అలియాస్ పవన్ కుమార్(27) తన మిత్రులు గుబ్బ శివరామకృష్ణ(20), రాజమహేంద్రపు అనిల్ (19), నంబిగారి సాయికుమార్ (20), ఓ మైనర్ బాలుడితో కలిసి పథకం ప్రకారం వెంకటరమణను హతనయ చేసినట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా పంపెన అయ్యప్ప స్వామి అలియాస్ పవన్ కుమార్ తల్లి గత కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందింది. దీంతో తన బంధువుల వద్ద ఉంటున్నాడు. పవన్ గత కొన్ని సంవత్సరాల క్రితం శ్రావణి సంధ్య అనే యువతిని ఇష్టపడ్డాడు. ఈ విషయమై యువతి కుటుంబ సభ్యులతో పెళ్లి సంబంధం ప్రస్తావన తీసుకురాగా యువతి తల్లి నిరాకరించింది. ఈ క్రమంలో శ్రావణి సంధ్యకు అదే గ్రామానికి చెందిన కల్ల వెంకటరమణ అనే వ్యక్తితో పెళ్లి జరిగింది. అప్పటి నుంచి తాను ప్రేమించి పెళ్లి చేసుకోవాలని అనుకున్న యువతిని పెళ్లి చేసుకున్న వెంకటరమణపై కక్ష పెంచుకున్న పవన్ ఎలాగైన వెంకటరమణను అంతమొందించి యువతికి దగ్గర కావాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గత కొన్ని నెలల క్రితం వెంకటరమణ తన భార్య శ్రావణి సంధ్యతో కలిసి కేపీహెచ్బీ కాలనీలో నివాసం ఉంటున్నట్టు తెలుసుకున్న పవన్ వెంకటరమణ ఇంటి చుట్టు రెక్కి నిర్వహించడం, శ్రావణిని ఫాలో చేయడం చేస్తూ వచ్చాడు. ఒక రోజు శ్రావణిని ఫాలో అవుతున్న పవన్ కుమార్‌ను వెంకటరమణ, అతడి తోడల్లుడు దుర్గా ప్రసాద్ పట్టుకుని మళ్లీ వెంట పడితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని మందలించారు. వెంకటరమణను అడ్డు తొలగించుకుంటే తాను ఎలాగైన శ్రావణికి దగ్గర కావచ్చునని భావించిన పవన్ కుమార్ ఈ నెల 12వ తేదీన వెంకటరమణ సర్దార్ పటేల్ నగర్‌లోని కేఎస్ఆర్ ఎనక్లేవ్‌లోని తన తోడల్లుడి ఇంటికి వచ్చాడని తెలుసుకుని తన మిత్రులు గుబ్బ శివరామకృష్ణ (20), రాజమహేంద్రపు అనిల్ (19), నంబిగారి సాయికుమార్ (20), మైనర్ బాలుడితో కేఎస్ఆర్ ఎన్‌క్లేవ్ అపార్టుమెంట్ వద్దకు చేరుకుని పక్కనే ఉన్న పార్కులో మిత్రులతో కలిసి మద్యం సేవించాడు. అపార్ట్‌మెంట్ గేటు ముందు తన స్కూటీని నిలిపి వెంకటరమణ తోడల్లుడు దుర్గాప్రసాద్‌తో గొడవ పెట్టుకుని దుర్భాషలాడటం ప్రారంభించాడు. దీంతో అక్కడే ఉన్న వెంకటరమణ బయటికి వచ్చి గొడవ ఎందుకు పడుతున్నావు, బూతులు తిట్టవద్దని వారించాడు. అప్పటికే తన వద్ద ఉన్న కత్తితో పవన్ ఒక్కసారిగా వెంకటరమణ ఛాతిలో పొడిచాడు. దీంతో వెంకటరమణ తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. స్థానికులు, వెంకటరమణ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పవన్‌తో పాటు అతడికి సహకరించిన నలుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు. నిందితుల్లో ఒకరు మైనర్ బాలుడు ఉన్నట్టు డీసీపీ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై, సిబ్బందిని డీసీపీ, ఏసీపీలు అభినందించారు. వారి వద్ద నుంచి శాంసంగ్ గ్యాలెక్సీ ఏ12 మొబైల్, యూఎస్ఏ సాబెర్ అని రాసి ఉన్న 28 సెంటీమీటర్ల పొడవు ఉన్న కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## ప్రతినెల సివిల్ రైట్స్ డే నిర్వహించేలా చర్యలు

-రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఆల్ ఇండియా హుమెన్ రైట్స్ గ్రేటర్ అధ్యక్షుడు సిరిగిరి శ్యామ్

**చిక్కడపల్లి, మే 15 ప్రభాతవార్త:** ప్రతినెల సివిల్ రైట్స్ డే నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హామీ ఇచ్చారు. గురువారం రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఆల్ ఇండియా హుమెన్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సిరిగిరి శ్యామ్ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి సమస్యలతో కూడినవినతిపత్రాన్ని సమర్పించారు. హైదరాబాద్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ప్రతినెల సివిల్ రైట్ డే నిర్వహించేలా చూడాలని, ఎవరైనా పౌర హక్కులకు భంగం కలిగించినా, కుల వివక్షత చూపించినా తక్షణమైన రక్షణ కోసం ఫిర్యాదు చేసే చట్టాలపై అవగాహన కల్పించే విధంగా, జాతి మతం సంబంధం లేకుండా చట్ట ప్రకారం సమాన సామాజిక అవకాశాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ప్రజా ప్రయోజన పథకాలపై అవగాహన కల్పించే విధంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ప్రతినెల సివిల్ రైట్ డే ని నిర్వహించేలా చూడాలని వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో నాయకులు రాకం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కులగణన సామాజిక న్యాయం కోసం

-రాష్ట్ర బిసి కమిషన్ మాజీ చైర్మన్

డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

**నాంపల్లి, మే 15 ప్రభాతవార్త :** జనాభా గణనలో కులగణన చేపట్టాలనే నిర్ణయం గొప్పది, చారిత్రాత్మక ఘట్టమని, కులగణన రాజకీయ ప్రయోజనాల కోసం కాదు రాజ్యాంగం చెప్పిన సామాజిక న్యాయం కోసం ఎంతో అవసరమని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. అయితే కులగణన చట్టబద్ధంగా అమలయ్యేటట్లు జనగణన చట్టాన్ని తగిన సెక్షన్లతో సవరించడం తప్పనిసరి కానీ భిన్నంగా కొంతమంది అధికారులు చట్టాన్ని తప్పుగా అర్థంచేసుకుని కేంద్రప్రభుత్వాన్ని తప్పుదోవపట్టిస్తున్నారని ఆయన వాపోయారు. డెప్లీ లాజ్ కేసు 1951 ప్రకారం చట్టంలోలేని విషయాన్ని కార్యనిర్వాహక నిబంధనల ద్వారా అమలుచేయడం చట్టవిరుద్ధమని సుప్రీం కోర్టు స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎస్సీ ఎస్టీలు రాజ్యాంగ షెడ్యూళ్లలో ఉన్నందున వారి గణన చట్టబద్ధం. కానీ బిసిలకు అలాంటి చట్టబద్ధ గుర్తింపు లేకపోవడం వల్ల చట్టసవరణ తప్పనిసరని కృష్ణమోహన్‌రావు స్పష్టం చేశారు. పుట్టస్వామి తీర్పు 2017 ప్రకారం వ్యక్తిగత గోప్యత హక్కు ఉల్లంఘనకు ఇది దారితీయొచ్చని అన్నారు. చట్టం లేకుండా కులగణన చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో జనగణన చట్టం 1948లో కులం అనే పదాన్ని చేర్చాలని, సెక్షన్ 8ను సవరించి అధికారులకు స్పష్టత ఇవ్వాలని, సెక్షన్ 8ఎ ద్వారా గోపత్యతా పరిరక్షణ, వినియోగ పరిమితులు చేర్చాలని వకుళాభరణం సూచించారు. సామాజిక గణాంకాలు అన్యాయాన్ని చూపించే అద్దంలా ఉండాలన్న డా. బి.ఆర్.అంబేద్కర్ వ్యాఖ్యను డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఉటంకించారు.

## దివంగత మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పొరేటర్ పొన్నాల

**నాచారం, మే 15 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గానికి తన సోదరుడు దివంగత ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి చేసిన సేవలు మరువలేనివని, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బ్రమ్మ పూరి కాలనీ లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సంతాప సభలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రాజిరెడ్డి చిత్రపటానికి నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన తుదిశ్వాశ వరకు ప్రజల కోసమే ఆలోచించే వ్యక్తి రాజిరెడ్డి అన్నారు. ఆయన మరణం అందరికీ తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు హమాలీ శ్రీనివాస్, రెడ్డి సంఘం నాయకులు కాసం రాజిరెడ్డి , ధర్మారెడ్డి , దోమ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సాయినగర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటం

**హైదరాబాద్, మే 15 ప్రభాతవార్త:**

అంబర్‌పేట డివిజన్‌లోని సాయినగర్‌లో 38 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనిని గురువారం స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యభిచార ముఠా గుట్టు రట్టు

**కంటోన్మెంట్, మే 15 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ లో నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు వ్యభిచార ముఠా గుట్టు రట్టు చేశారు. ముగ్గురు యువకులను, ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకొని గోపాలపురం పోలీసులకు అప్పగించారు. రెజిమెంటల్ బజార్‌లో బంగ్లాదేశ్‌కి చెందిన యువతితో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి ఆర్గనైజర్ (పశ్చిమ బెంగాల్ స్థానికురాలు), మహిళా సెక్స్ వర్కర్ సరఫరాదారు (బంగ్లాదేశ్ జాతీయుడు), కస్టమర్‌ను అరెస్టు చేసి, ఇద్దరు బాధితులను రక్షించారు, వీరిలో ఒకరు బంగ్లాదేశ్ జాతీయుడు. ప్రస్తుతం రెజిమెంటల్ బజార్‌లో ఉంటున్న వెస్ట్‌బెంగాల్‌కు చెందిన అసైన్ సేన్ కుమారుడు బిమల్ సేన్(36)(ఆర్గనైజర్), బంగ్లాదేశ్ చిట్టగాంగ్‌కు చెందిన సకిల్ హుస్సేన్(29)(సప్లయర్), వెస్ట్‌బెంగాల్‌కు చెందిన నాసిర్ అలీ(36)(కస్టమర్)అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరితో పాటు ఇద్దరు యువతులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ముగ్గురు నిందితులు శివ, బాబు, శికాలు పరారీలో ఉన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులు, కస్టమర్‌తో పాటు పట్టుబడ్డారు, వీరి వద్దనుంచి రూ.2వేల రెండు వందల 70, రూ. 65వేల విలవచేసే సెల్‌ఫోన్‌లు ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ మేయర్ అమర్ సింగ్ , పప్పుల అంజిరెడ్డి

**మేడిపల్లి, మే 15 ప్రభాతవార్త ;** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లో మాజీ మేయర్ అమర్ సింగ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి గారితో కలిసి స్థానిక కాలనీ ప్రజల సమక్షంలో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి , బండి శ్రీనివాస్ గౌడ్, స్థానిక కాలనీ వాసులు పాల్గొని, కాలనీ ప్రజలు అమర్ సింగ్ , పప్పుల అంజిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల కాలనీ అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## షాదీ ముబారక్ పథకంతో మహిళలకు మేలు

### -ఎమ్మెల్యే అహ్మద్ బలాల



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

**మలక్ పేట ,మే 15, ప్రభాతవార్త:** షాదీ ముబారక్ పథకం మహిళలకు ఎంతో మేలు చేకూరుస్తుందని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట్ నియోజకవర్గానికి చెందిన సుమారు 62 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన రూ .62 లక్షల చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారాన్ని కృషి : ఎమ్మెల్సీ మీర్జా రియాజ్



ఎమ్మెల్సీ మీర్జా రియాజ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు రాము చిత్రంలో చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట ,మే 15, ప్రభాతవార్త :** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన మీర్జా రియాజ్ ను మలక్ పేట కాలాడేరా నుంచి కాంగ్రెస్ నాయకులు రాము ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, అజంపుర డివిజన్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

## కుటుంబ వ్యవస్థ ఎంతో పురాతనమైనది : మధుసూదనాచారి



ఆదర్శ కుటుంబం అవార్డులను అందజేస్తున్న శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

**మలక్ పేట ,మే 15, ప్రభాతవార్త:** ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ ఎంతో పురాతనమైనదని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనా చారి పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలో జరిగిన అంతర్జాతీయ కుటుంబాల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు ప్రముఖులకు ఆదర్శ కుటుంబం అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆదర్శ కుటుంబం అవార్డు గ్రహీతలు శోభడాక్టర్ రామచంద్రరావు, మాధవి వై.శ్రీనివాసులు, రేణుక డాక్టర్ మధుసూదన్ రావు, బత్తిన పద్మ నరసింహులు గౌడ్, సుజాత శంకర్, ఆమంచ అంజయ్య లను అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమానికి సభాధ్యక్షులుగా మురళీమోహన్ రాజు వ్యవహరించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, సినీ దర్శకులు డాక్టర్ నిట్టల గోపాల కృష్ణ, రిటైర్డ్ జడ్జి డాక్టర్ బూర్గుల మధుసూదన్ రావు, కార్పొరేట్ ట్రైనర్ సర్వేపల్లి గోపికృష్ణ, కవయిత్రి డాక్టర్ రాధా కుసుమ, నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు చెరువుల సమస్యలపై డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డికి వినతి



డిప్యూటీ మేయర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎన్ఎండీసీ, డిఫెన్స్ కాలనీ వాసులు

**తార్నాక, మే 15 ప్రభాతవార్త :**
ఎన్.ఎం.డీ.సి కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, అనంత సరస్వతి నగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈస్ట్ ఆనంద్ మల్కాజ్గిరి కాలనీలో ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యలు గురువారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి,టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డికి తార్నాకలోని వారి నివాసంలో వినతిపత్రాన్ని అందజేశారు. బండ చెరువు నుండి జడ్పీఎస్ లాలాపేట్ వరకు కాలువ నిర్మాణం, బండ్లగూడ చెరువు అదనపు వర్షం నీటి సమస్యలను పరిష్కరించాలని వారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ స్పందిస్తూ జలమండలి, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి కాలనీల సమస్యలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి, నివాసితుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

# బోడుప్పల్ దళితుల భూ సమస్యపై సిఎంను కలిసిన మాజీ మేయర్

### -పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

**బోడుప్పల్, మే 15 ప్రభాతవార్త ;** బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో బోడుప్పల్ లో ఉన్న దళితుల భూ సమస్య పరిష్కారించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి గారిని ఆయన నివాసంలో కలసి చర్చించడం జరిగింది. దీనికి వెంటనే సానుకూలంగా స్పందించి త్వరలో పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ ... బోడుప్పల్ అభివృద్ధి చెందడంతో దళితులు ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని ల్యాండ్ పుల్లింగ్ క్రింద ప్రభుత్వం లేఅవుట్ చేయగా కొన్ని ఇబ్బందులతో ఆగిపోవడం జరిగింది. దళితుల జీవితాలను దృష్టిలో పెట్టుకుని పరిష్కరించేందుకు సీఎంను కలిసామని త్వరలోనే భూ సమస్య పరిష్కారమవుతుందన్నారు.దీనితో పాటు బోడుప్పల్ నగరాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. దానికి సీఎం సానుకూలంగా స్పందించినట్టు అజయ్ యాదవ్ పేర్కొన్నారు .

# గ్రీన్‌పార్క్ కాలనీలో అనుమతిలేని నిర్మాణం కూల్చివేత



సెల్లార్ స్లాబును కూల్చివేస్తున్న సిబ్బంది

**సైదాబాద్, మే 15 ప్రభాతవార్త :** లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్క్ కాలనీ అర్చ్ సమీపంలో మెగా ఫంక్షన్‌హాల్ ఎదురుగా 1215 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతూ ఇప్పటికే పూర్తయిన సెల్లార్ స్లాబ్ కూల్చివేత పనులను టౌన్ ప్లానింగ్ సిబ్బంది గురువారం చేపట్టారు. అనుమతి లేకుండా సెల్లార్ స్లాబు వేశారంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేతలు చేపడుతున్నామంటూ హంగామా చేసి చివరకు ఇదే స్లాబుకు అక్కడక్కడా రంధ్రాలు పెట్టి మమ అనిపించారు. మూడు నెలల తర్వాత తాజాగా మరోసారి గురువారం స్లాబుకు రంధ్రాలు చేస్తూ కూల్చివేతలను ప్రారంభించారు. ఈ సారైనా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేతలను పూర్తి చేస్తారో లేక మధ్యలోనే ఆపి మరో దఫా చేపడుతారో వేచి చూడాలి.

# నేటి నుండి లింగస్వామి కళ్యాణ మహోత్సవాలు



**సరూర్‌నగర్, మే 15 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ గ్రామ శివార్లలోనున్న పురాతన లింగమయ్యగుట్టపై వెలసిన శ్రీశ్రీశ్రీ లింగస్వామి కళ్యాణ మహోత్సవాలు నేడు 16వ తేదీ శుక్రవారం నుండి ప్రారంభంకానున్నాయి. నాదర్‌గుల్ గ్రామ ప్రజలు, పెద్దల సహకారంతో గ్రామ పెద్ద గొల్లలు జెనిగె శ్రీశైలం యాదవ్, వల్లపు యాదయ్య యాదవ్‌ల కార్యనిర్వహణలో స్థానిక శ్రీ గోపాలకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీలింగస్వామి, మాణిక్యాల దేవి కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎండా కాలం నేపథ్యంలో ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గుట్ట మెట్ల మార్గంలో చలువ పందిర్లు (తట్టీలు) అదే విధంగా కళ్యాణ మహోత్సవాలు జరిగే ప్రాంతంలో విద్యుత్ లైట్లు, మంచి నీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు శుక్రవారం తెల్లవారు జామున కంటే ముందు 4.30 గంటలకు పుట్ట కప్పుటతో అంకురార్పణ జరుగుతుంది. ఆ తరా ్వత 17వ తేదీ శనివారం ఉదయం పుట్ట బంగారం తెచ్చుట, అనంతరం లింగస్వామి గంగాపూజ, సాయంత్రం, లింగ స్వామి గంప జాతర, రాత్రి 10.30 గంటలకు లింగస్వామి ఒగ్గు కథ ఉంటాయి. ఉత్సవాల్లో కీలక ఘట్టమైన లింగస్వామి, మాణిక్యాల దేవి కళ్యాణం 18వ తేదీ ఆదివారం ఉదయం 11.15 గంటలకు నిర్వహిస్తారు. అనంతరం బోనాలు, అగ్నిగుండాలు, బలిహరణం, హారతి కార్యక్రమాలు జరుపుతారు. 19వ తేదీ సోమవారం మధ్యాహ్నం రేణుకా ఎల్లమ్మ వేషధారణలో ఒగ్గు కళాకారుల ఒగ్గు కథ, 20వ తేదీ మంగళవారం లింగస్వామి తొక్కుడు మైలలు, గడపల కడుగుట, గొర్లకు సల్ల తాపడంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. ఈ మేరకు ప్రతిష్టాత్మకంగా జరిగే లింగస్వామి కళ్యాణ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని గ్రామ పెద్ద గొల్లలు జెనిగె శ్రీశైలం యాదవ్, వల్లపు యాదయ్య యాదవ్‌లతో పాటు శ్రీగోపాలకృష్ణ యాదవ సంఘం ప్రతినిధులు అదే విధంగా మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్ కోరారు.

**సబితారెడ్డి ఆహ్వానించిన నాదర్‌గుల్ యాదవులు**

కాగా ప్రతిష్టాత్మకంగా జరిగే నాదర్‌గుల్ లింగస్వామి కళ్యాణ మహోత్సవాలకు హాజరుకావాలని గ్రామానికి పలువురు యాదవులు స్థానిక మహేశ్వరం ఎమె ్మల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కోరారు. శ్రీనగర్‌లోని సబితారెడ్డి నివాసానికి తరలివెళ్ళిన తిరుపల్లి సుధాకర్ యాదవ్, దండు యాదయ్య యాదవ్, తర్రె మల్లేష్ యాదవ్, కొండ విజయ్ యాదవ్, దండు బాబు యాదవ్, తర్రె శ్రీశైలం యాదవ్, రవి యాదవ్, తిరుపల్లి నవీన్ యాదవ్, జెనిగె ప్రసాద్ యాదవ్ తదితరులు భాగ్యనగర్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, డైరెక్టర్ యెల్చల సుదర్శన్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్‌రెడ్డిలతో పాటు కందికంటి పెంటయ్యగౌడ్, మర్రి చిన్న నర్సింహారెడ్డి, పన్నాల కృష్ణారెడ్డి, కోటగిరి జంగయ్యలతో కలిసి సబితారెడ్డిని ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

## వివేక్‌నగర్‌లో కమ్యూనిటిహాల్ ప్రారంభం



వివేక్‌నగర్‌లో కమ్యూనిటిహాల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, మే 15 ప్రభాతవార్త :** రామంతాపూర్ వివేక్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమ్యూనిటి హాల్‌ను గురువారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వివేక్‌నగర్ కాలనీలో గతంలో ఉన్న నిర్మించిన కమ్యూనిటిహాల్, బస్తీ దవాఖానా, వార్డు కార్యాలయంలో ఉపయోగించుకోవడం జరుగుతుందని తెలిపారు. దీనిపై అధనపు అంతస్థు నిర్మించి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకుని వస్తున్నామని తెలిపారు. మహిళలు కూడా దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీవాణిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు అశోక్‌రాజా, కోశాధికారి మురళీధర్‌చారి, ఉపాధ్యక్షులు సాయినాద్, జగదీష్, బోగాల అరుణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం హుండీ లెక్కింపు



శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం హుండీ లెక్కిస్తున్న ఆలయ చైర్మన్ నామ్ రాజిరెడ్డి, సభ్యులు

**రామంతాపూర్, మే 15 ప్రభాతవార్త :**
రామంతాపూర్‌లోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం హుండీ గురువారం లెక్కింపు చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కొండూరి సురేంద్ర, నరేందర్, ఆలయ చైర్మన్ నామ్ రాజిరెడ్డి, కమిటి సభ్యులు సతీష్‌గౌడ్, జంగయ్య, బాలయ్య, మెంగ శోభ, ఎక్స్ అఫిషియో మెంబర్ ఎం.శేఖర్ బాబు, మెంగ రవి, ప్రవీణ్‌శర్మ, రాఘవేందర్, నాంచారయ్య తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత ఐదు నెలలకు గాను శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.1,03,648 వచ్చినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు పాల్గొన్నారు.

**ప్రారంభమైన లక్ష్మీ గణపతి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు**

**సరూర్‌నగర్, మే 15 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ కాలనీలోనున్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, కార్యవర్గ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు గణపతి పూజతో ఉత్సవాలను ప్రారంభించారు.అనంతరం ఆలయ ప్రదక్షిణ, యాగ శాల ప్రవేశం, దీక్షా వస్త్రాల సమర్పణ, కంకణ ధారణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. తొలి రోజు పూ జా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యుడు ఎంవి కృష్ణారావుతో పాటు పలువురు సభ్యులు, శివసాయినగర్, టిఎస్ ఆర్‌నగర్, బాలాజీనగర్ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదు

**సరూర్‌నగర్, మే 15 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని టిపిసిసి సభ్యుడు, నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో స్థానిక కాంగ్రెస్ నాయకులు షేక్ జహంగీరుద్దీన్, తయ్యబ్ దయాని, సయ్యద్ అబ్దుల్ రవూఫ్, రవికుమార్, కెంచె లక్ష్మీనారాయణ, యాదగిరి, నవాజ్ తదితరులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా సంక్షేమం జరుగుతున్నదని అన్నారు. ఉచిత ఆర్టీసి బస్సు సౌకర్యం, సన్నబియ్యం పంపిణీ, పేదలకు రూ.500లకే ఉచిత గ్యాస్, 200 యూనిట్ల లోపు ఇళ్ళకు ఉచిత విద్యుత్ తదితర పథకాలు అమలు చేయడం వల్ల ప్రజలు ముఖ్యంగా మహిళలు హర్షిస్తున్నారని ఆయన వివరించారు. ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శలు చేస్తే సహించమని ఆయన స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ కార్యదర్శిగా కాళిదాసు



నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే.

**హయత్ నగర్, మే 15 ప్రభాత వార్త:** కాంగ్రెస్ పార్టీ పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ కమిటీ కార్యదర్శిగా మద్దిలి కాళిదాసును నియమిస్తూ మున్సిపాలిటీ కమిటి అధ్యక్షుడు కొత్తపల్లి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కాళిదాసుకు సదరు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్షేత్ర స్థాయిలో పార్టీ అభివృద్ధికి పాటుపడాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గంట లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు

## 20 న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

**వనస్థలిపురం. మే.15.ప్రభాతవార్త :** ఏ.ఐ. టి. యూ. సి. హయత్ నగర్ మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు ఆధ్వర్యంలో మే.20న జరుగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతు గా వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణ కు ఏ.ఐ. టి.యూ. సి.నాయకులు పానుగంటి పర్వతాలు, సామిడి శేఖర్ రెడ్డి లు గురువారం సమ్మె నోటీసు పత్రాన్ని అందజేశారు. అనంతరం సమ్మెకు సంబంధించిన గోడపత్రికను మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు భాగ్యమ్మ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మే.20 న వామపక్ష సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికులు స్వచ్ఛందగా పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమావత్ సక్కునాయక్,నర్సింహా, మంగ,రవికిరన్, ప్రశాంతి, సునీత,ప్రభావతి,లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి : చింతల



క్యారం బోర్డ్ అందజేస్తున్న అరుణసురేందర్‌యాదవ్

**ఎల్‌బినగర్, మే 15 ప్రభాతవార్త:** పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అందుకు కాలనీ ప్రజలు కూడా అందుకు సహకరించాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పేర్కొన్నారు. చాణక్యపురి కాలనీలో గురువారం స్వచభారత్ కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..కాలనీలో రోడ్లపై చెత్త తొలగించాలని జిహెచ్ఎంసి కార్మికులకు సూచించారు. కాలనీ వాసులు ఎవరు కూడా రోడ్లపై చెత్త వేయకుండా స్వచ ఆటో నీ ఉపయోగించుకోవాలన్నారు. అలాగే ప్రతి 15రోజులకు ఒకసారి స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రతి కాలనీలో నిర్వహించాలన్నారు. ప్రతి కాలనీలో కూడా స్వచ్ఛభారత్ నిర్వహిస్తే కాలనీ పరిశుభ్రంగా ఉంటుందని, ఎలాంటి రోగాల బారిన పడకుండా ఉంటామన్నారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి నుండి వచ్చిన స్పోర్ట్స్ కిట్స్ ను కాలనీ వాసులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు చలపతి రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీధర్ బాబు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మొరిశెట్టి శ్రీనివాస్‌కు ప్రముఖుల నివాళి



మొరిశెట్టి శ్రీనివాస్‌గుప్త చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సబితాఇంద్రారెడ్డి

**ఎల్‌బినగర్, మే 15 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ ధర్మకర్త ఇటీవలె అకాల మరణం చెందిన మొరిశెట్టి శ్రీనివాస్‌గుప్త దశదినకర్మ కార్యక్రమం గురువారం వాసవికాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్రపటానికి మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రరెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్, భీగాల గణేష్‌గుప్తా, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుకా ఉపేందర్‌రెడ్డి, టిఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, జగిని రమేష్‌గుప్తాలు హాజరై శ్రీనివాస్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో లోకసాని కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జిల్లెల్ల కృష్ణారెడ్డి, ఎండీ. సాజీద్, రామ్‌నర్సింహా గౌడ్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : పవన్



**ఎల్‌బినగర్, మే 15 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. భరత్‌నగర్ ఫేస్1, రాజీవ్‌గాంధీనగర్ ఫేస్ 2లో రూ.49లక్షల వ్యాయంతో నిర్మించిన నూతన సిసి రోడ్డు కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేలా చూడాలన్నారు. నూతన సిసి రోడ్డు పనుల్లో నాణ్యత పరమైన లోపాలు లేకుండా చూసుకోవాలని డివిజన్ ఎఈకి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ షరీఫ్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కాలనీవాసులు రామ్‌చందర్, స్వామి, వెంకటేష్, బిక్షపతి, మల్లేష్ యాదవ్, సైదులు, బాలు, సాయి, నాయకులు సుందర్ నారాయణ, తోట మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**హయత్ నగర్, మే 15 ప్రభాతవార్త:** ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... కుంట్లూరు గౌరెల్లి మార్గంలో నర్సరీ పక్కన వేప చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి (45)టవల్ తో ఉరి వేసుకొని చనిపోయినట్లు గురువారం సాయంత్రం 4 గంటలకు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి 45 సంవత్సరాల వయసు కలిగి ఉన్నాడని, ఎరుపు రంగు టీ షర్టు మరియు నలుపు రంగు నెక్కరు వేసుకొని ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సంబంధికులు ఎస్సై లక్ష్మీనారాయణను 8712662286 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీలక్ష్మి నృసింహ స్వామి వార్షిక మహోత్సవం



ఉప్పల శ్రీనివాసును సన్మానిస్తున్న నిర్వాహకులు

**అబ్దుల్‌పూర్‌మెట్, మే 15 ప్రభాతవార్త:** అబ్దుల్‌పూర్‌మెట్ మండలం గౌరెలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి 7వ వార్షిక మహోత్సవంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఉప్పల శ్రీనివాస్‌గుప్త పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. స్వామి వారి ఆశీస్సులు అందరి మీద వుండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో గోవర్ధనం రఘునాధా చార్యులు, ప్రవీణ్ కుమార్ చార్యులు, నవీన్ కుమార్ చార్యులు, దేవస్థాన పాలక మండలి చైర్మన్ నెల్లూరి రాజు, శ్రీనివాస్, నిరుడు రాజుముదిరాజ్, రాజేష్‌గౌడ్, దివ్య దాసు పాల్గొన్నారు.

## ఎస్‌బిహెచ్ సి కాలనీలో రోడ్డు నిర్మాణం ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, మే 15 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ ఎస్‌బిహెచ్ సి కాలనీలో రూ.15లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. రోడ్ల నిర్మాణంలో తగిన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎన్.చారి, అమృత రామయ్య, పండరి నాథ్, పరమేష్, కిషోర్, చందు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిస్కారానికి కృషి : లచ్చిరెడ్డి



కాలనీవాసులతో సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. మే.15.ప్రభాతవార్త.**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బి.యన్.రెడ్డి నగర్ ఫేస్ 1లో కొంతమేర కాలనీలో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ ఇబ్బందికరంగా ఉందని కావున నూతన డ్రైనేజ్ పైపులను నిర్మించాలని కాలనీవాసులు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారిని కోరడంతో స్పందించిన కార్పొరేటర్ గారు వెంటనే నూతన డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత జలమండలి మేనేజర్ సిరివెన్నెల గారితో కలిసి కాలనీలో పర్యటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, పోచమ్మ దేవాలయం చైర్మన్ ప్రదీప్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రాములు, బిక్షపతి సేటు, కాశిరెడ్డి మరియు నాయకులు సురేష్ కుమార్, జలమండలి సూపర్వైజర్ జయసింహ మరియు తదితరులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి చిత్రపటానికి ఘన నివాళి



ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 15 ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపి సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం హబ్సిగూడలోని మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డి నివాసంలో ఆయన చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి చేసిన సేవలు అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన ఎంతో సేవ చేశారని కొనియాడారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి కోసం పాటుపడ్డారని తెలిపారు. రాజిరెడ్డి కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, జెట్ట కిషోర్, పిల్లి నాగరాజు, గుడి మధుసూధన్‌రెడ్డి, బోసాని పవన్ కుమార్, పంగ మహేందర్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, మాస శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొనసాగుతున్న అంజన్న జాతర

**వనస్థలిపురం. మే.15.ప్రభాతవార్త.**
బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ లోని సాహెబ్ నగర్ లో గల శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి జాతర అంగరంగ వైభవంగా, భక్తుల కోలాటల మధ్య ఘనంగా కొనసాగుతుంది. గురువారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవాన్ని ఆలయ పూజారులు, గ్రామప్రజలు ఘనంగా నిర్వహించారు.అదేవిధంగా రావణ దహన కార్యక్రమం జరిగింది. సాయంత్రం స్వామివారి ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మురళీ కృష్ణ,ఆలయ అర్చకులు దీన్ దయాల్ పూజారి, హేమంత్ త్రివేది పూజారి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## పురుగుల మందు సేవించి యువకుడి ఆత్మహత్య

**ఉప్పల్, మే 15 ప్రభాతవార్త :** ఆర్థిక సమస్యలతో ఒక యువకుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం, పెండ్యాల గ్రామానికి చెందిన బండి కృష్ణ (20) బంజారాహిల్స్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. అయితే గత కొద్ది రోజులుగా ఆర్థిక సమస్యలతో తాను ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో ఈనెల 12వ తేదిన ఉప్పల్ మెట్రో స్టేషన్ కింద పురుగుల మందు సేవించి అపస్మారకస్థితికి చేరడంతో అతనిని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు మృతుడి సోదరుడు బండి సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.